

ఆగని శిశు మరణాలు

ప్రజాశక్తి -హుకుంపేట:- మండలంలోని రాప పంచాయితీ లివిటీలో గ్రామంలో శిశువు మృతితో కుటుంబ సభ్యుల రోధన పలువురిని కలచి వేసింది. గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ మోహన్‌బాబు, మీనాల దంపతుల 3 నెలల బాబు శనివారం మరణించాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వరుస శిశు మరణాల తో నూతన దంపతులు బెంబేలెత్తి పోతున్నారు. 3నుంచి 5నెలలలోపు అభం శుభం తెలియని పసి పిల్లలు పుట్టి చనిపోతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వరుసగా 2023-24 సంవత్సరా ల్లో సుమారు 16 మంది మృతి చెందడంతో కలకలం రేపుతోంది. శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరణాలకు అసలు కారణాలు పసిగట్టి నివారణకు చర్యలు చేపట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. లివిటిలో బాధిత కుటుంబానికి గ్రామస్తులు, టీడీపీ అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చప్పలి శంకర్ కలిసి దహన సంస్కరణ ఖర్చులకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

బురద నేల..టార్పాలిన్ మాటున..

విద్యార్థుల చదువులు!

-వర్షం వస్తే బూరిగ పాఠశాల దుస్థితి ఇదీ..

ప్రజాశక్తి-అనంతగిరి: చదువుకోవడానికి కనీస పాఠశాల భవనం లేక వర్షానికి విద్యార్థులు తార్పాలిన్ కట్టి బురధ నేలపై కూర్చుని చదువుకోవాల్సిన దుస్థితి గిరిజన పేద విద్యార్థులకు నెలకొంది. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి బూరిగ ఎంపీపీ పాఠశాలలో చిన్నకొన్నెల , బూరిగ గ్రామాలకు చెందిన 35 మంది విద్యార్థులు విద్యను అభ్యశిస్తున్నారు. పాఠశాల మంజూరైనప్పటి నుండి నేటి వరకు ప్రభుత్వం ఎటువంటి పాఠశాల భవనం మంజూరు చేయ లేదు. దీంతో, విద్యార్థులు ఎండాకాలంలో చింతాచెట్టు కింద, వర్షాకాలంలో తార్పాన్ కట్టి కటిక బురద నేలపై కూర్చొని విద్యా బోధన కొనసాగిస్తున్నారు.

ఇదిలా ఉండగా పాఠశాల నిర్మాణానికి 2012 సంవత్సరంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పునాది నిర్మించి వదిలి వేశారు. దీంతో విద్యార్థులకు కనీస భవనం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామస్తులు జిల్లా కలెక్టర్, పిఒ లకు లిఖితపూర్వకంగా విన్నవించిన్నా పట్టించుకోనె నాదుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉమ్మడి కూటమి ప్రభుత్వం స్పందించి పాఠశాల భవనం నిర్మించాలని వార్డు మెంబర్ ఎస్.అప్పాలరాజు, తల్లి తండ్రులు బి.పెంటయ్య, కె.సింహాచలం, తదితరులు కోరారు.



బురదనేలపై కూర్చుని టార్పాలిన్ కింద చదువుతున్న విద్యార్థులు



డిఎల్‌పిఒకు వినతిపత్రం ఇస్తున్న వార్డు సభ్యులు విష్ణు తదితరులు

నిధులు స్వాహాపై డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం జెర్రిల పంచాయతీలో నిధులు స్వాహాపై మండల కేంద్రంలో పంచాయతీరాజ్ శాఖ డిఎల్‌పిఒ పిఎస్.కుమార్ శనివారం విచారణ చేపట్టారు. జెర్రిల పంచాయతీలో ఎటువంటి పనులు చేయకుండా లక్షలాది రూపాయలు సర్పంచి నాగరాజు, కార్యదర్శి వెంకట్రావు స్వాహా చేశారని అల్లూరు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఆ పంచాయతీ వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు డిఎల్‌పిఒ కుమార్ శనివారం జీకే వీధి ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ మాట్లాడుతూ భౌగోళికంగా పంచాయతీ పరిధిలో పనులు చేశారా లేదా అనే కోణంలో సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులు సమక్షంలో పరిశీలించి వారం రోజుల్లో గ్రౌండ్ రిపోర్ట్ ఇవ్వాలని పిఆర్ జెఇ జ్యోతిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కళ్యాణ్‌ను ఆదేశించినట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలో అసంపూర్తిగా పనులు చేయకుండా విడిచిపెట్టిన కాంట్రాక్టర్‌పై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కార్యదర్శి ఆదేశించినట్లు తెలిపారు. పంచాయతీ వార్డు సభ్యుడు పొత్తూరు విష్ణు ప్రజాశక్తితో ఫోన్లో మాట్లాడుతూ పంచాయతీ నిధులు స్వాహాపై సమగ్రమైన దర్యాప్తు చేసి స్వాహా చేసిన నిధులు పంచాయతీ అకౌంట్లో జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని డిఎల్‌పిఒకు మరోసారి వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జికె.వీధి ఇఒపిఆర్‌డి పాపారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టాలి

-ఆశ్రమాల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించండి- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన విద్యార్థుల మరణాల నియంత్రణకు సమగ్ర దర్యాప్తు చేసి, పట్టిష్టమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాడేరు సి.పి ఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నో ఆశలతో స్కూల్స్‌కి వెళుతున్న గిరిజన విద్యార్థులు అనేకమంది తరుచుగా మృతి చెందుతుండటంతో తల్లిదండ్రులు తీవ్రమైన మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటికే సుమారు 10 మంది విద్యార్థులు ఈ ఏడాదిలో మరణించారన్నారు. పౌష్టిక ఆహారాన్ని అందించే చర్యలు సక్రమంగా లేవని, వాటి పర్యవేక్షణ సమర్థవంతంగా లేదన్నారు. చిన్న పాటి జ్వరాలకే గిరిజన విద్యార్ధులను మృతి చెందుతున్నారని, రక్తహీనత నివారణకు స్కూల్‌లో అవగాహన కార్యక్రమాలు చెప్పలేదని తెలిపారు. అరకు గురుకుల బాలికల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని జన్ని ప్రియాంక అనారోగ్యం బారిన పడటంతో హుటాహుటిన అరకు ప్రాంతీయ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా వైద్యం అందించిన కొద్ది క్షణంలోనే ప్రియాంక చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు చనిపోతున్నా సంబంధిత అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు స్పందించిన పరిస్థితి కనిపించ లేదని విమర్శించారు. తమ పిల్లలు ఎందుకు మృతి చెందుతున్నారో కూడా తెలియని దుస్థితిలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఉన్నారని, కనీసం పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని అప్పగిస్తున్నారన్నారు. మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వలేదని, ఆదుకొనే పరిస్థితి లేదన్నారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్‌లను నియమిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సి.పిఎం మండల కార్యదర్శి ఎల్ సుందరరావు, సీనియర్ నాయకుడు పి.లక్కు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-హుకుంపేట: విద్యార్థి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కౌసల్య, హైమావతి డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ, అరకు వేలి మండలం ఎండపల్లివలస గిరిజన ఏపీ ఆర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి జన్ని ప్రియాంక మరణానికి పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలన్నారు. మరణించిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రతి హాస్టల్స్‌లో ఏఎన్ఎంలు ఉండేవారని గత ప్రభుత్వం వారిని తొలగించిందన్నారు.. కూటమి ప్రభుత్వం వెంటనే ప్రతి హాస్టల్‌కి ఏఎన్ఎంలను నియమించి విద్యార్థుల మరణాలను ఆపాలని వారు కోరారు.

అక్రమంగా పైపులైన్లు ఏర్పాటు చేస్తే చర్యలు

-డిఇ కరుణ

ప్రజాశక్తి-చింతపల్లి: అక్రమంగా పైపులైన్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని గ్రామీణ నీటి పారుదలశాఖ డీఈ కరుణ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ, మన్య ప్రాంతంలో రక్షిత తాగునీటి కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా కృషి చేస్తున్నాయని, జలజీవన్ మిషన్ పనుల ద్వారా ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో ఇప్పటికే ఇంటింటి కుళయిల నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తాను త్వరలోనే వీటన్నింటిపై సమీక్షించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.



తుపాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి రంపచోడవరం

తుఫాను నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. శనివారం ఆయన కాంపు కార్యాలయంలో మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాగులు పొంగే సమయంలో ప్రజలు ఎట్టి పరిస్థితిలో వాగులు దాట వద్దని సూచించారు. ఏజెన్సీలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా రెవిన్యూ, రోడ్డు భవనాలు, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏజెన్సీలో వాగులు దాటకుండా అన్ని మండలాల్లోని రెవెన్యూ, పోలీసు అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సహాయక చర్యలు చేపట్టేందుకు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో 9441058457, 9492920383, సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08864243561 నెంబర్లతో టోల్ ఫ్రీ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏజెన్సీలోని ఎక్కడైనా తుపాను వలన ఇబ్బందులు పడుతున్న వారు ఈ నెంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



మాట్లాడుతున్న పిఒ సింహాచలం



ఆందోళన చేస్తున్ననాయకులు, మహిళలు

తాగునీటి సమస్యపై సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని నాన్ షెడ్యూల్ గరుగుబిల్లి పంచాయతీ పరిధి పైడిపర్తి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, బోరు మరమ్మత్తు పనులు చేపట్టి తాగునీరు అందించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం మండల నాయకులు జేష్ట వెంకటరమణ, ఆర్.శ్రీనులు మాట్లాడుతూ,గ్రామస్తులు తాగునీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని, దీంతో, కిలో మీటర్ దూరంలో ఉన్న కలుషితమైన గెడ్డ నీటిని ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.తక్షణమే పంచాయితీ. అధికారులు బోరు మరమ్మతు పనులు చేపట్టి తాగునీటిని సరఫరా చేయాలన్నారు. లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి మండల కేంద్రంలో అందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి కుటుంబీకులతో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

కెజిహెచ్‌కు విద్యార్థి తరలింపు

ప్రజాశక్తి-పాడేరు : ముంచంగిపుట్టు మండలం బాబుసాల పంచాయితీ గాజుల బంద గ్రామానికి చెందిన గొల్లూరి వంశీ (14) మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమం పాఠశాల-2 లో 9వ తరగతి చదువుతున్నాడు. బలహీనంగా ఉండటంతో రక్తహీనతతో బాధ పడుతున్నాడేమో అని భావించి అధికారులు శనివారం పాడేరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకొని వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం విద్యార్థి గుండె సమస్యతో బాధపడుతున్నాడని వైద్యులు గుర్తించారు. విద్యార్థిని విశాఖపట్నం కెజిహెచ్ తరలించాలని సూచించగా తల్లిదండ్రులు నిరాకరించారు. వెంటనే సమాచారాన్ని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ దృష్టికి తీసుకుని వెళ్లారు. ప్రాజెక్ట్ అధికారి జిల్లా ఆస్పత్రిని సందర్శించి విద్యార్థి తల్లిదండ్రులను ఒప్పించి ప్రత్యేకంగా అంబులెన్స్ ను ఏర్పాటు చేసి విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అనంతరం ఆయన ట్రైబల్స్ అధికారులతో మాట్లాడి వంశీకి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వార్డెన్ రాంబాబును విద్యార్థి వెంట వెళ్లాలని పిఒ ఆదేశించారు. విద్యార్థితోపాటు వార్డెన్, విద్యార్థి తండ్రి కేజీహెచ్ బయలుదేరి వెళ్లారు.

తుపాన్ ప్రభావంతో నేలకొరిగిన వరిచేలు

ఆందోళనల్లో రైతులు



రాజవొమ్మంగిలో నేలకొరిగిన వరి చేను

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ రైతుల పాలిట శాపంగా మారింది. తుఫాను ప్రభావంతో శనివారం ఉదయం నుండి కుడుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు, ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో వరిచేలు నేలకొరిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రంపచోడవరం డివిజన్లో సుమారు 6, హెక్టార్లో ఖరీఫ్ వరి సాగు రైతులు చేపట్టారు ఇప్పటికే పంటపై దుక్కు, కూలీ, ఎరువులు, పురుగుమందులు రూపేనా ఎకరానికి సుమారు రూ 20.వేలు పైబడి పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పంట పక్వానికి వచ్చిన నేపథ్యంలో తుఫాను ప్రభావంతో అకాల వర్షాలు కురవడంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. రాజవొమ్మంగి మండలంలో పలు గ్రామాల్లో ఇప్పటికే అనేకమంది రైతులు వరిచేలు కోత కోశారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఏమైపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుపాన్‌తో రైతుల్లో తీవ్ర ఆందోళన

సీలేరు : తుపాన్ కారణంగా జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ, సప్పర్ల, గుమ్మరేవులు, గాలికొండ పంచాయతీల పరిధిలో శనివారం ఒక మోస్తర్ వర్షం కురవడంతో గిరి రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వరి, సామలు, కొర్రలు తదితర పంటలు కోత కోసే సమయంలో వర్షాలు కురవడంతో పంటలు పాడైపోయి ఆర్థికంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

ఇప్పటికే కొంత మంది కోసిన వరి ఇతర పంటలను భద్రపర్చుకున్నారు. మరి కొంతమంది రైతులు పంట పొలాల్లో వరి చేను కుప్పలుగా వేశారు. ప్రస్తుతం తుఫాన్ కారణంగా వర్షం పడుతుండడంతో వరి కుప్పలపై మైకా కవర్లు కప్పి తడవకుండా చర్యలు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మరికొంత మంది రైతులకు చెందిన వరి పంట కోసి పొలాల్లో ఉండడంతో వర్షానికి తడిసిపోయింది. ధాన్యం మొలకలు వచ్చి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం తగ్గితే కోసిన వరి పనులు భద్రపరచుకోవడానికి అవకాశం ఉంటుందని, లేకుంటే పంట నేల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కారణంగా పంట నష్టం జరిగితే ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు.



వరి కుప్పపై టార్పాలిన్ కప్పిన దృశ్యం

శాశ్వత డిఆర్ డిపో ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం బూదరాళ్ల గ్రామపంచాయతీ గరిమండ గ్రామస్తులకు శాశ్వత డిఆర్ డిపో ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గరిమండ గ్రామానికి పదేళ్ల నుండి డిఆర్ డిపో ఉన్నా రహదారి సౌకర్యం లేకపోవడంతో జికె.వీధి మండలం తూరిమామిడి గ్రామంలో కొన్నాళ్లు బియ్యం పంపిణీ చేశారు. తరువాత నుండి అదే మండలంలోని నేర్లబంద గ్రామంలో కమ్యూనిటీ హాల్ వద్ద రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. అయితే తమ కమ్యూనిటీ హాల్లో ఏదైనా అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలంటే తమకు ఇబ్బందిగా ఉందని, తక్షణమే ఈ కమ్యూనిటీ హాల్‌ను ఖాళీ చేయాలని నేర్లబంద గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో గరిమండ గ్రామస్తులకు రేషన్ సరుకులు పంపిణీకి డిఆర్ డిపో లేకుండా పోయింది. పదేళు గడిచినా కనీసం మినీ డిఆర్ డిపో కూడా ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరమని గరిమండ గ్రామస్తులు కొర్రా తిరుపతిరావు, రమణ బాబు, బోనంగి సతీష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి గరిమండ గ్రామస్తులకు శాశ్వత డిఆర్ డిపో ఏర్పాటు చేయాలని, అంతవరకు అద్దె భవనంలో తాత్కాలిక డిఆర్ డిపో నిర్వహించాలని వారు కోరుతున్నారు.



కమ్యూనిటీ హాల్ వద్ద సరుకులు తీసుకుంటున్న గిరిజనులు



కళాశాల ఆవరణలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు మానవహారం నిర్వహించి ఎయిడ్స్ వ్యాధిని తరిమికొట్టాలి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి అనే నినాదాలు చేస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ వి శంకర్రావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి మన దేశాన్ని పట్టిపీడిస్తుందని, దానిని తరిమికొట్టేందుకు విద్యార్థులు ప్రజల్లో విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. యువత యుక్త వయసులో చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎయిడ్స్ వ్యాధి నిర్మూలించడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్త పరీక్షల్లో ఎయిడ్స్ ఉన్నట్లు నిర్ధారణ అయితే ప్రతి నెల దానికి సంబంధించిన మందులు వాడుతూ మంచి ఆహారం తీసుకుంటే ప్రాణాపాయం ఉండదని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, జిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం రంప గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రంప గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొమరం బుచ్చన్న దొర, గంగల అబ్బాయి దొర, విష్ణు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి:అనారోగ్యంతో బాధపడుతూ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. మండలంలోని పెద్దబిడ్డ స్కూల్ కాంప్లెక్స్ పరిధి రాయపాడు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు సూకురు. లచ్చన్న శనివారం అకాల మరణం చెందినట్లు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు, .ఉపాధ్యాయులు ఎస్.కోటలో తన నివాసంలో కుటుంబ సభ్యులను ఓదార్చారు **ఫోటో ఉంది**



సమన్వయ సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్ తదితరులు

జాతీయ లోక్ అదాలత్‌లో భూ తగాదాలు, సివిల్ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జాతీయ లోక్ అదాలత్‌లో భూ తగాదాలు, సివిల్ కేసులను ఎక్కువగా పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గౌరవాధ్యక్షులు ఆలపాటి గిరిధర్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం నూతన న్యాయ స్థానాల భవన సముదాయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనంత ఎక్కువ కేసులు పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ, రెవెన్యూ, భూ నష్టపరిహార కేసులు ప్రభుత్వానికి చెందిన ఇతర సివిల్ కేసులు జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. విశాఖ పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ చలనాల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. క్రిమినల్ కేసులు పెద్ద సంఖ్యలో రాజీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. జీవిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్, వి.ఎంఆర్‌డిఎ కమిషనర్ కె.ఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ, జీవిఎంసి, వి.ఎంఆర్‌డిఎ లకు చెందిన టాక్స్‌కు సంబంధించిన కేసులు రాజీ చేస్తామని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా చూడాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయకుండా చూడాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 1342వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో ఐద్వా నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతారని అంతా భావించారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంతవరకూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ప్రధానమంత్రితో ఒక్కసారి కూడా మాట్లాడినట్లు పత్రికల్లో చూడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాలు, అలవెన్సుల్లో కోతలు పెరిగాయన్నారు. కేంద్రంలోని మోడీకి రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కె.మణి, బి.భారతి, కె.కుమారి, ఆర్.విమల, బి.మమత, ఎం.నిర్మల, కె.సంతోషం, జి.మణి, కె.సత్యవతి, ఆర్.పార్వతి, ఆర్.ముత్యాలమ్మ, పి.మహాలక్ష్మి పాల్గొన్నారు.


నినదిస్తున్న ఐద్వా సభ్యులు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. ప్రధాన రహదారుల కిరువైపులా ఆక్రమణలు జరిగితే వి.ఆర్.ఓలపై చర్యలు తీసుకుంటామన్నారు. రహదారులు భవనాల శాఖకు చెందిన భూములు, బంజరు భూములు, గ్రామ కంఠం దురాక్రమణ జరగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనన్నారు. శనివారం ఆయన కార్యాలయం నుండి ఐటిడిఏ పి. ఓలు, సబ్‌కలెక్టర్లు, తహాశీల్దారులు, ఎంపిడిఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోరంబోకు స్థలాలు ఆక్రమణలు జరిగితే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల వారీగా ప్రభుత్వ భూములను ఆడిట్ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఆక్రమణలపై సమగ్రమైన సర్వే చేసి సర్వే నెంబర్లు గుర్తించాలని అన్నారు. డిసెంబరు నెలాఖరు నాటికి ల్యాండ్ ఆడిట్ పూర్తి చేయాలని స్పష్టం చేసారు. పాడేరు మండల కేంద్రంలో ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఆక్రమణలు జరిగితే వి.ఆర్ఓను సస్పెండ్ చేస్తామన్నారు. వారపు సంతల్లో ప్రభుత్వ భూములను గుర్తించి షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. షెడ్ల నిర్మాణానికి గ్రామ సభ తీర్మానం చేయాలని, గ్రామ సభలో గిరిజన వ్యాపారులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.వారపు సంతలో వ్యాపారాలు చేస్తున్న గిరిజనులు, గిరిజనేతరులను గుర్తించాలన్నారు. చింతూరు, రంప చోడవరం డివిజన్లలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటు చేయడానికి అనువైన భూములను గుర్తించి ప్రతిపాదించాలని పేర్కొన్నారు. రంపచోడవరం రెసిడెన్షియల్ స్కూలు సమీపంలో ఉన్న భూమిలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. డిసెంబరు 3,4 తేదీలలో వి.ఆర్ ఓలు, ఆర్.ఐలకు రెవెన్యూ చట్టాలపై శిక్షణ అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రీ, చింతూరు పి.ఓ అపూర్వ భరత్, 22 మండలాల రెవెన్యూ అధికారులు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్లకు...

ఉద్యోగ భద్రత కల్పించాలి

జెడ్‌పిటిసి గంగరాజు


మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని అనంతగిరి జడ్పిటిసి సభ్యులు దీసరి గంగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ ఎదుటగిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ టీచర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 సంవత్సరాలుగా పని చేస్తున్న ఏపిఆర్ గురుకులం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించి రెగ్యులేషన్ చేయాలన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వెట్టి చాకిరీ చేయిస్తుందన్నారు. అవుట్ సోర్సింగ్ నుండి కాంట్రాక్టు పద్ధతిలో మార్చాలని డిమాండ్ చేశారు. 2022 పి.ఆర్.సి.ప్రకారం వేతనాలు చెల్లించాలని డి.ఎ.ఎస్సి నుండి ఈ పోస్టులు మినహాయించాలన్నారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు వీరి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పాడేరు పాలక వర్గ సమావేశం, జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో చర్చించి తీర్మానం చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఆర్ గురుకులం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్.కొండబాబు, కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు మోహన్, సి.ఆర్.టి లు పాల్గొన్నారు.

వీడని ముసురు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణాంగా గత రెండు రోజుల నుంచి మండలంలో ముసురుతో జల్లులతో వర్షం కురుస్తుంది. శీతాకాలం కావడంతో చలిగాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో గిరిజనులు బయటికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. కోత కోసిన వరి, సామ, రాగులు వంటి పంటలపై టార్పలిన్లు కప్పుతున్నారు. పంటలు కోత సమయంలో ముసురు పట్టి వర్షం కురుస్తుండడంతో వ్యవసాయ రైతులు ఆందోళన చెందుతున్నారు.

అల్ప పీడనంపై అప్రమత్తంగా ఉండండి

చింతపల్లి : అల్పపీడన ప్రభావం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య సూచించారు. శనివారం వారు మాట్లాడుతూ, రాబోవు నాలుగు రోజులలో మన్య ప్రాంతంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు సూచిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి కోతలను మరో నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోతలు కోసిన వరి పంటను తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పుకొని కాపాడుకోవాలని సూచించారు. ఇటువంటి అల్పపీడనాలు సంభవించి గిరి రైతులకు అపార నష్టం కలిగిస్తున్నాయని తెలిపారు. గిరి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు కోరారు.

నేరాలు ఘోరాలు


18 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని ములియపుట్టు గ్రామ పంచాయితీ శాంతినగర్ కాలనీ గ్రామ శివారులో ఇద్దరు వ్యక్తులు గంజాయిని రవాణా చేస్తుండగా ముందస్తు సమాచారం మేరకు పట్టుకోవడం జరిగిందని స్థానిక ఎస్సై ఎల్ సురేష్ శనివారం పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాల క్రితం కూలి పనుల నిమిత్తం హుకుంపేట మండలం ములియపుట్టు పంచాయతీ శాంతినగర్ కాలనీలో ఈ గంజాయి నిందితుడు అద్దె ఇంట్లో ఉంటూ తన స్వగ్రామంలో పండించిన గంజాయిను ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటాడు. రాయగడ జిల్లా మెహర్పూర్ గ్రామం ఒడిశా రాష్ట్ర నికి చెందిన ఓ వ్యక్తికి ఐదు కేజీల గంజాయి అమ్మి రవాణా చేయుటకు సిద్ధంగా ఉండడంతో సమాచారం మేరకు ఆ గ్రామానికి సిబ్బందితో చేరగా బైక్‌లో 18 కేజీల గంజాయి ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.


పట్టుబడిన నిందితులతో పోలీసులు

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు

ప్రజాశక్తి-జిమాడుగుల: మండలంలో కే.కోడాపల్లి పంచాయతీ కేంద్రంలో గ్యాస్ సిలండన్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సోమేలి భాస్కరరావు భార్య శాంతి టీ కాచేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించింది, ఒక్కసారిగా మంటలు గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. భయభ్రాంతులకు గురైన ఆమె బయటకు పరుగులు తీసింది. చుట్టుపక్కల ఉన్న వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఇంట్లో ఉన్న సామాగ్రితో పాటు 30 వేలు నగదు, ధాన్యం బస్తాలు, దుస్తులు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


దగ్ధమైన సిలిండర్

ఎఎంసిలో పోస్టుల భర్తీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర వైద్య కళాశాలలో 29 కాంట్రాక్టు, 71 అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మీడియాకు తెలిపారు. వీటిలో 10 కాంట్రాక్ట్ పోస్టుల మెరిట్ జాబితా, 71 అవుట్ సోర్సింగ్ పోస్టులకు ప్రొఫెషనల్ మెరిట్ లిస్ట్ జాబితా ఆంధ్ర వైద్యకళాశాల అధికారిక వెబ్సైట్ www.amc.edu.in నందు విశాఖపట్నం NIC website www.visakhapatnam.ap.gov.in recruitmentamcgreivances@gmail.com నందు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వీటిపై అభ్యంతరాల స్వీకరణకు 10 రోజులు గడువు ఇచ్చినట్లు తెలిపారు.

జిల్లా పరిషత్‌లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగులకు ఆరోగ్య సేవల్లో భాగంగా మెడికవర్ హాస్పిటల్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యాన జిల్లా ప్రజా పరిషత్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఏటా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు.

2న విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి -తగరపువలస : తగ్గించిన ఆవుపాల సేకరణధర పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2న సోమవారం విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయాలని సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో యూనియన్ ం నాయకులు ఎస్ అప్పలనాయుడు, పి సూర్య నారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆవు పాల సేకరణ ధరను లీటరుకు రూ.3 తగ్గించడంతో డెయిరీ పరిధిలోని పాడిరైతులు రోజుకు రూ.20లక్షలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల పాడిరైతులు పెద్దఎత్తున పాల్గొని ముట్టడి ఆందోళన విజయవంతం చేయాలన్నారు.

పదో రోజుకు విశాఖ డెయిరీ కార్మికుల దీక్ష

ప్రజాశక్తి -గాజువాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు చేపడుతున్న రిలేదీక్షలు శనివారం పదోరోజుకు చేరుకున్నాయి.

ఈసందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ మాట్లాడుతూ, యాజమాన్యం తక్షణమే స్పందించి, కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.కార్మికుల సమస్యలపై రీజనల్ లేబర్ కమిషనర్ చర్చలకు రావాలని పిలిస్తే యాజమాన్యం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో యూనియన్ అధ్యక్షులు కెవి. వరాహమూర్తి, చిన్నమ్మలు, అనసూయ, వి నారాయణ పాల్గొన్నారు.

'ఉక్కు' సిజిఎమ్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉద్యోగ విరమణ చేస్తున్న స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ (వర్క్స్) ఉప్పులూరి శ్రీధర్‌ను స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి పెంపునకు ఉద్యోగులు, కార్మికులు అంకితభావంతో పనిచేయాలని, ఉక్కు ఫ్యాక్టరీకి మంచి భవిష్యత్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు కార్యక్రమంలో ఎస్‌సి లైసెన్ ఆఫీసర్ నల్లి సుందరం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్యనారాయణ, ఎల్‌వి.రమణారావు, ఆర్‌విఎన్ సాయిప్రసాద్, వైఎస్ఆర్‌టియు వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి పుల్లారావు కార్యదర్శి ఎస్ మోహన్‌బాబు, బిఎంకె రెడ్డి, కుసుమ శ్రీనివాస్ ఎంవి రావు పాల్గొన్నారు.

స్వీట్ షాప్‌లపై ఫుడ్ సేఫ్టీ దాడులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎంవిపి.కాలనీ టిటిడి కల్యాణ మండపం వద్దనున్న తాపేశ్వరం వారి లక్ష్మి గణపతి స్వీట్స్ షాప్, శ్రీ శివరామ స్వీట్స్, స్వీట్ ఇండియా తదితర షాపులపై ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. పలు ఆహార పదార్థాలను, వాటి తయారీకి వినియోగించే వస్తువులను సీజ్ చేసినట్లు ప్రాంతీయ నిఘా అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కొల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి ఎన్.మురళీకృష్ణ, ఫుడ్ సేఫ్టీ అధికారి జివి.అప్పారావు నేతృత్వంలో ఆయా స్వీట్ షాపులపై దాడులు చేసి నెయ్యి శ్యాంపిల్స్ సేకరించి, విశ్లేషణకు పంపించినట్లు తెలిపారు. ఆయా షాపులపై ఫుడ్ సేఫ్టీ యాక్ట్ 2006 ప్రకారం కేసులు నమోదు చేసి నోటీసులు జారీ చేశామన్నారు.

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ బదిలీ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్ కుమార్‌ను అనంతపురం జైలుకు బదిలీ చేస్తూ రాష్ట్ర జైళ్ళ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో నెల్లూరు కేంద్రకారాగారంలో అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.మహేష్‌బాబు రానున్నారు. విశాఖ కేంద్రకారాగారం అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును నెల్లూరు జైలుకు బదిలీ చేశారు. తదుపరి ఉత్వర్వులు అందేవరకు ఎం.మహేష్ బాబును సూపరింటెండెంట్‌తో పాటు అదనపు సూపరింటెండెంట్ బాధ్యతలు నిర్వహించాలని ఉత్వర్లుల్లో పేర్కొన్నారు. నెల్లూరు కేంద్రకారాగారంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డి.శరబాబు, ఎన్.సాయి ప్రవీణ్‌లను విశాఖ కేంద్రకారాగారానికి బదిలీ చేసారు.

కనులపండువగా అనంతుని దీపోత్సవం

- వర్షపు జల్లుల్లోనూ పోటెత్తిన భక్తులు
- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు


దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి కొండపై దీపోత్సవం కనులపండువగా సాగింది. తుపాన్ ప్రభావంతో వీడకుండా జల్లులు కురుస్తున్నప్పటికీ, అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపోత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవానికి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దేవస్థానం ఇఒ నానాజీబాబు ఆధ్వర్యంలో అధికారులు, మధురవాడ ఎసిపి బి.అప్పలరాజు నేతృత్వంలో పోలీసులు పటిష్ఠఏర్పాట్లు చేశారు

అనంతుని దీపోత్సవంలో భాగంగా కుంతీమాధవస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో స్వామి ఉత్సవ విగ్రహాలను ఘాట్‌రోడ్డులో వెయ్యవ మెట్టు వద్ద ప్రతిష్టించారు. కొండ దిగువన కుంతీమాధవస్వామి అలయంలోనూ వేకువజామున 4గంటలకే సుప్రభాత సేవలతో మేల్కొలిపి, ఇతర పూజలు అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బారికేడ్ల ద్వారా ఆరుగంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కుంతీమాధవస్వామి అలయంలో కొలువుదీరిన శ్రీదేవి,భూదేవి సమేత అనంతపద్మనాభుని ఉత్సవ విగ్రహాలను గరుడు వాహనంపై ప్రతిష్ఠించి, ప్రధమమెట్టు వరకు ఊరేగించారు. తప్పెటగుళ్ళ, కోయడాన్స్‌లు, పులివేషాలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమంలో,వేలసంఖ్యలో భక్తులు పాల్గొనగా, తిరువీధి ఉత్సవం ఘనంగా సాగింది. అనంతరం సాయంత్రం 5.30గంటలకు ఆనవాయితీ ప్రకారం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు పేరిట గోత్రనామాలతో పూజలు చేసి, దీపోత్సవాన్ని ప్రారంభించగా, వేలదీపాలతో అనంతపద్మనాభుని కొండ దేదీప్యమానంగా అలరారింది. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


భక్తులతో కిక్కిరిసిన మెట్ల మార్గం

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

అనంతుని దీపోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విజయనగరం, తగరపువలస, విశాఖ వైపునుంచి వచ్చే వాహనాలకు వేర్వేరుగా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. విజయనగరం, తగరపువలస, నీలకుండీల నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్ సర్వీసులను నడిపింది. మధ్యాహ్నం 3గంటల తర్వాత పద్మనాభంలోకి బస్సులు, వాహనాలు రాకుండా మళ్లించారు.

పటిష్ట పోలీసు భద్రత

దీపోత్సవానికి వేలల్లో భక్తులు తరలిరావడంతో ఎసిపి బి.అప్పలరాజు ఆధ్వర్యంలో50మంది పోలీసు ఉన్నతాధికారులు, వందమంది మహిళాపోలీసులతో సహా 450 మంది పోలీసులు భద్రత కల్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నాలుగు ఉచిత వైద్యశిబిరాలు, రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. రెండు అగ్నిమాపక వాహనాలు.సిద్ధం చేశారు. భీమిలి ఆర్‌డిఒ ఆధ్వర్యంలో తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది భక్తులకు సహకరించారు.

వ్యర్థాల సద్వినియోగంపై అవగాహన

విశాఖ వేలీ స్కూల్‌లో 'క్యాచ్ దెమ్ యంగ్ "ప్రాజెక్టు ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : వ్యర్థాల నుంచి సంపద సృష్టిపై ప్రోత్సహిస్తున్న అంతర్జాతీయ సంస్థ ఐకాన్ ఫౌండేషన్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్త ఆధ్వర్యాన విశాఖ వేలీ పాఠశాలలో 'క్యాచ్ దెమ్ యంగ్, జీరో వేస్ట్ అండ్ సర్క్యులర్ ఎకానమి ఇన్ క్యాంపస్' ప్రాజెక్టును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ సాధనకుమార్ ఘోష్ మాట్లాడుతూ దేశంలో 152 పాఠశాలలలో రెండు లక్షల మంది విద్యార్థులు ఈ ప్రాజెక్టులో ఇప్పటి వరకు భాగస్వామ్యులయ్యారన్నారు. విశాఖ వేలీ స్కూల్‌లో ఈ ప్రాజెక్టు ద్వారా నగరంలోని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, పాఠశాల ఆవరణలో మూడు రకాల డస్ట్‌బిన్‌ల ఏర్పాటు ద్వారా వ్యర్థాల సేకరణ, వాటితో ఉపయుక్తమైన వస్తువుల తయారీపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈశాన్య రాష్ట్రాలలో ఈ ప్రాజెక్టు విజయవంతమైందన్నారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విశాఖ వ్యాలీ పాఠశాల అధ్యాపకులు

రాత్రి వేళ నిలిచిన ఆర్‌టిసి బస్సు

- అవస్థలు పడ్డ ప్రయాణీకులు
- అస్తవ్యస్త రోడ్డుతో తరచూ మరమ్మతులు

ప్రజాశక్తి-సీలేరు :విశాఖపట్నం డిపోకు చెందిన విశాఖ భద్రాచలం బస్ సర్వీస్ సాంకేతిక లోపాలు కారణంగా శనివారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో సీలేరులో అర్ధాంతరంగా నిలిచిపోయింది. విశాఖపట్నంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరిన ఈ బస్సు శనివారం తెల్లవారుజాము 3 గంటల సీలేరుకు మూడు కిలో మీటర్ల దూరంలో బస్సు బ్రేకులు పట్టకపోవడంతో డ్రైవర్ బస్సును నిలిపివేసి లోపాలను పరిశీలించారు. బ్రేకులు వద్ద ఉన్న హెయిర్ పైపు మరమ్మతులకు గురైనట్లు గుర్తించి నెమ్మదిగా సీలేరు తీసుకొచ్చారు. ఆర్టీసీ అధికారుల ఆదేశాలు మేరకు ప్రయాణికులను సీలేరు నైట్ హాల్ట్ బస్సులో ఎక్కించి భద్రాచలం సురక్షితంగా చేర్చారు.

అయితే సీలేరు నైట్ హాల్ట్ బస్సులో ఉదయం 6 గంటలకు సీలేరు నుంచి విశాఖ బయలుదేరి వెళ్లవలసిన ప్రయాణికులు భద్రాచలం నుండి ఉదయం 10 గంటలకు వచ్చిన బస్సులో వెళ్లాల్సి వచ్చింది. ఉదయం 6 గంటల నుండి ప్రయాణికులు కాంప్లెక్స్‌లో నిరీక్షించాల్సి వచ్చింది. కాలం చెల్లిన బస్సులు ఆర్టీసీ అధికారులు నడపడంతో పాటు ఇటీవల లంకపాక నుంచి సీలేరు వరకు వరదల కారణంగా రహదారి అస్తవ్యస్తం మారడంతో తరచూ బస్సులు మరమ్మతులకు గురై ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకు నూతనంగా బీటీ రోడ్డు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు వేగవంతం చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

గంజాయి రవాణా కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ/ విశాఖ కలెక్టరేట్ : అల్లూరి జిల్లా జి.మాడుగుల నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి తెలిపిన వివరాలివి. తమిళనాడుకు చెందిన షకీలా గుణ, పాలిని రాజేష్, నజీర్ భాష, జబునిషాలు జి.మాడుగుల మండలం దిగురుపల్లి గ్రామానికి చెందిన లాసంగి మల్లన్న ద్వారా 20 కిలోల గంజాయి కొనుగోలు చేసి చెన్నై తీసుకెళ్లేందుకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న నగర పోలీసులు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని, గంజాయిని మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

12 కిలోల గంజాయి పట్టివేత

ఎస్.రాయవరం: మండలంలోని అడ్డురోడ్డు జంక్షన్ వద్ద ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 12 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు స్థానిక ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గంజాయి ప్యాకెట్లతోపాటు ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. నిందితుల్లో నలుగురు కడప జిల్లా నంద్యాలకు చెందిన వారు కాగా, మరొకరు గంజాయి సరఫరాదారు అల్లూరి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు.

హనీ ట్రాప్ కేసులో ప్రధాన ముఠా సభ్యుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలో సంచలనం సృష్టించిన జాయ్ జమీమా హనీ ట్రాప్ కేసులో ప్రధాన ముఠా సభ్యుడు వేణుభాస్కర్‌రెడ్డిని ఎయిర్‌పోర్టు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. కొంత కాలంగా నిందితుడు దేశంలో వివిధ ప్రాంతాల్లో దాక్కొని తప్పించుకు తిరుగుతుండటంతో పోలీసులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి చాకచక్యంగా వేణు భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. వేణు భాస్కర రెడ్డి జమీమాతో సహజీవనం చేసి, ఆమె చేసిన నేరాల్లో ప్రధాన సభ్యుడుగా ఉంటూ దాడులు, హత్యా ప్రయత్నాలలో భాగమయ్యాడు.

వివాహమైన పురుషులను మత్తులోనికి దించే ప్రక్రియలో కీలక పాత్ర పోషించాడని, బెదిరింపుల ద్వారా భారీగా నగదు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నగరంలో మరి కొన్ని ప్రాంతాల్లో నమోదైన కేసుల్లో ఇంకా దర్యాప్తు జరుగుతుందని అధికారులు తెలిపారు. జాయ్ జమీమా విశాఖపట్నంలో ధనికులు, వివాహమైన పురుషలను లక్ష్యంగా చేసుకుని వారితో మోసపూరిత ప్రేమాయణం, సహజీవనం, నిశ్చితార్థాలు చేసుకుని వారిని బెదిరించి రూ.లక్షలు వసూలు చేసి చివరకి వారిపై దాడులు, హత్యా ప్రయత్నాలు చేయించి అరెస్ట్ అయి జైలులో ఉన్న విషయం విదితమే.